క్లుప్తంగా

376 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి -1 పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 376 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్‌ఎం విశాలి, ఆశావర్కర్లు కుమారి, రాణి, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీకి 31 వరకూ గడువు

సీతానగరం: గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకూ గడువు ఉందని సీతానగరంలోని జయ రోహన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత సూరెడ్డి శివకుమార్ శనివారం తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, లీజు ఒప్పందం, ఓటరు ఐడీ కార్డ్, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలలో ఏదో ఒకటి చూపి గ్యాస్ ఏజెన్సీలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వ సబ్సిడీలు వర్తించవని, తక్కువ సిలెండర్లు ఇస్తారని తెలిపారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెదపూడి: సంపర గ్రామంలోని కొలువైన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం ఆదివారం ఉదయం 9 గంటలకు కన్నుల పండువగా నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు తెలిపారు. వైఖానస ఆగమం ప్రకారం కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణం సందర్భంగా శనివారం వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగాదేవిలను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా చేశారు. స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, తులసిపూజ, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మంటల అదుపుపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న ఐటీసీఎల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం

మధురపూడి: భూమి లోపలి పెట్రోలు, డీజిల్ వెళ్లే పైప్‌లైన్ నుంచి మంటలు వస్తే, వాటిని వెంటనే అదుపు చేయాలని ఐటీసీఎల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అన్నారు. దీనిపై జగ్గంపేట మండలం రాజపూడిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఆయన శనివారం కోరుకొండలో విలేకరులతో మాట్లాడారు. మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేసే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందుల భాగంగా పైప్‌లైన్ సేఫ్టీ మెథడ్స్ పోస్టర్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే అటువంటి ప్రమాదాలు సంభవిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004252159కు తెలియజేయాలన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ముగ్గళ్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ రఘుదేవపురం ఫీడర్ లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. రఘుదేవపురంలో నివాసాలకు, సీతానగరం, రఘుదేవపురంలో లంకభూముల వ్యవసాయ మోటార్లకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వేసవి తరగతులు వాయిదా వేయాలి

రాజానగరం: సీబీఎస్‌ఈ సిలబస్ పేరుతో వేసవి సెలవులలో శిక్షణ తరగతులను నిర్వహించడం సరికాదని, వెంటనే వాయిదా వేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఎస్టీయూ రాష్ట్రస్థాయి ఉద్యమ శిక్షణ తరగతులకు హాజరైన వారు శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వెకేషన్ డిపార్టుమెంట్ అయిన విద్యాశాఖలోని ఉపాధ్యాయులను వెకేషన్ నుంచి దూరం చేసేలా తరగతులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. వెకేషన్ కాలంలో ఎన్నికల విధులలో ఉన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు.

విజ్ఞాన ప్రాప్తిరస్తు

- గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా తరలి వస్తున్న విద్యార్థులు



రంగంపేట శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రంగంపేట: గ్రంథాలయాలు రా రమ్మని పిలుస్తున్నాయి. ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు శిబిరాలు దోహదపడుతున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం జూన్ 7 వరకూ కొనసాగనుంది. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులు జరుగుతున్నాయి. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, ఇంగ్లిష్, భావ వ్యక్తీకరణ తదితర అంశాల్లో పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. విద్యార్థులు శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకాన్ని చదివిన తరువాత మిగిలిన తరగతులు ప్రారంభిస్తున్నారు. స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం), నీతి కథలు తదితర అంశాల్లో తర్ఫీదునిస్తున్నారు. రోజుకో అంశంలో చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృత్యం తదితర అంశాల్లో నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులతో తరగతులు చెప్పిస్తున్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, అరటి పండ్లు అందిస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నాం



వేసవి శిక్షణ శిబిరానికి నిపుణులు, ఉపాధ్యాయులు, యువకులు వచ్చి స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నారు. కొత్త కొత్త విషయాలను పిల్లలకు నేర్పిస్తున్నాం. చదువుకు ప్రాధాన్యమివ్వడం ద్వారా భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలు వివరించి చెబుతున్నాం.

– ఎస్.రామకోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, రంగంపేట

వివిధ రకాల బొమ్మలు వేస్తున్నా



చిత్రలేఖనంపై ఆసక్తితో వేసవి శిబిరంలో శిక్షణ తీసుకుంటున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నాను. పేపరుతో పలు రకాల ఆకృతులు తయారు చేయడం, ఇంగ్లిష్, సైన్సు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇవి భవిష్యత్‌లో మాకు ఎంతో ఉపయోగపడతాయి.

– కె.శ్యామ్‌కుమార్, 9వ తరగతి, రంగంపేట

కథలంటే ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. వేసవి శిబిరంలో ఎంతో ఆసక్తి గల కథలు చెబుతున్నారు. కథలతో పాటు కాగితం బొమ్మలు, డ్రాయింగ్ నేర్చుకుంటున్నాను. సులభంగా బొమ్మలు ఎలా వేయాలో తర్ఫీదునిస్తున్నారు. ఇలాంటి మెళకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– జె.నికిల్ వెంకట్, 10వ తరగతి, రంగంపేట

స్నేహితులతో ఆనందంగా గడుపుతున్నాను



నేను మా స్నేహితులతో కలిసి డ్రాయింగ్, ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాను. వేసవి సెలవులను బాగా ఎంజాయ్ చేస్తున్నాను. పలు అంశాలల్లో బాగా పట్టు సాధిస్తున్నాను. మేము స్కూల్‌కి వెళ్లాక ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

– జె.శిరీష, 8వ తరగతి, రంగంపేట

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వడిశలేరు గ్రామస్తులు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వచ్చే నెల 4న వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లతో విజయం సాధించడం తథ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం గండ్రేడు, పుట్టకొండ, సంపర, కాండ్రేగుల, శహపురం గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు కృతజ్ఞత పర్యటన చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై పోలింగ్ జరిగిన తీరు, పోలింగ్ సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన ఎన్నికల సందర్భంగా పార్టీ శ్రేణులు విజయమే లక్ష్యంగా ఎంతో కష్టపడి పనిచేశారంటూ అందరికీ అభినందనలు తెలిపారు. తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంక్షేమ పాలన కోరుకుని మళ్లీ జగనన్నకు సీఎంగా పట్టం కట్టనున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచులు కుడిపూడి మాధవీలత, వల్లు వెంటరమణ, కె.వీరవెంకట సత్యనారాయణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస్, నూని పట్టాభిరామన్న చౌదరి, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, చందాళ్ల పార్వతి, మండల అబ్జర్వర్ కోనాల శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విజయం మనదే

అనపర్తి: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలిచారని, ప్రజల ఆశీస్సులతో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రానుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని రంగంపేట మండలం వడిశలేరు, బిక్కవోలు మండలం బలభద్రపురం, అనపర్తి పాతవూరు బాపనమ్మ అమ్మవారి గుడి ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగిన ఎన్నికల విధానం, పోలింగ్ సరళి, ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపై ఎమ్మెల్యే వారితో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించిన ప్రజలు ఈ ఎన్నికల్లో పార్టీకి అండగా నిలిచారన్నారు. జూన్ 4న విడుదలయ్యే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకూ కష్టపడి పనిచేసిన పార్టీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలభద్రపురం గ్రామం నుంచి బుంగ రామారావు, సబ్బెళ్ల వీర్రాఘవరెడ్డి, మేడపాటి ఆనందరెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, ద్వారంపూడి కృష్ణారెడ్డి, వడిశలేరుకు చెందిన పోతల బుల్లివీర్రాజు, కొల్లాటి ఇజ్రాయిల్, వైట్ల మురళి, మారేడి శ్రీరామకృష్ణ, అనపర్తికి చెందిన కోనాల శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రారెడ్డి, ఏడుకొండలు, కర్రి వెంకటరెడ్డి, యాసిడ్ రాము, నల్లమిల్లి నారాయణరెడ్డి, ద్వారంపూడి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..

- వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి 24 వరకూ మహోత్సవాలు



వేణుగోపాలస్వామి



వేణుగోపాలస్వామి వారి ఆలయం

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామ కల్యాణోత్సవానికి సర్వంసిద్ధమయ్యాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలిరోజు ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా వసతులు కల్పించారు.

స్థల పురాణం

గోదావరి గట్టున గల వేణుగోపాలస్వామి ఆలయం పూర్వకాలం నుంచీ దివ్యక్షేత్రమై విరాజిల్లుతోంది. చరిత్ర ప్రకారం.. 13వ శతాబ్దానికి ముందుగానే పరాశర మహర్షి గోదావరీ తీర ప్రాంతంలో ప్రతిష్ఠించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం అర్చనాది కైంకర్యాలు జరుగుతూ ఉండేవి. 13వ శతాబ్దంలో మహ్మదీయుల దండయాత్రలో భాగంగా దేవస్థానాలను ధ్వంసం చేస్తున్నారని తెలుసుకుని అప్పటి అర్చక స్వాములు శ్రీస్వామివారి మూల విరాట్‌ను గోదావరి తీరంలో దాచారు. అనంతరం 17వ శతాబ్దంలో వేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మి నృసింహస్వామి, వెంకటేశ్వరస్వామి వార్ల ఆలయాలు, విమానత్రయం, ముఖమండపం, కళ్యాణ మండపం, ప్రాకారాలను రాజా వెంకటరాయులు నిర్మించారు. స్వామివారి అర్చనాది కై ంకర్యాలు వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి వంశీకులతో వంశపార్యపంగా నేటికి జరుగుతున్నాయి.

నేడు స్వామివారి కల్యాణం

కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమవుతాయి. తొలిరోజు స్వామివారికి తిరు వీధి ఉత్సవం, రాత్రి 8 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. సోమవారం నిత్య హోమం, 21న సదస్యం, 22న స్వామి వారి రథోత్సవం , 23న స్వామివారికి చక్రతీర్థం, 24న స్వామి వారికి పుష్పయాగోత్సవం జరుగుతాయి.

పూర్తయిన ఏర్పాట్లు

క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా వసతులు కల్పించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



రంగంపేటలో మహిళల కుంకుమపూజలు

పెదపూడి: స్థానిక జనార్దన స్వామివారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రంగంపేటలో..

రంగంపేట: స్థానిక వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు గల్లా నారాయణరావు, మండవిల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్టీయూ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

రాజానగరం: ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి నాయకులుగా ఎదిగి, దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసిన వారు ఎందరో ఉన్నారని, అటువంటి వారి సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు ఉన్నవారే మంచి నాయకులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్త్రీల స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుడు చలం



చలం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: స్త్రీ జాతి చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు చలం అని తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్తంగా శనివారం గుడిపాటి వెంకటాచలం జయంత్యుత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంజీవరావు మాట్లాడుతూ మన మనసులోకి తొంగి చూసుకుంటే, మనలో ఉన్న చలం కనిపిస్తాడని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే సమాజంలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా హక్కులు, స్వేచ్ఛ ఉండాలని తన రచనల ద్వారా పోరాటం చేసిన స్త్రీవాద కవి చలం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీలు ఇంత స్వేచ్ఛగా ఉండగలుగుతుందంటే ఆనాటి మహాపురుషుల త్యాగ ఫలితమేనన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ మాట్లాడుతూ స్త్రీకి చదువు అవసరం లేదని సమాజం భావించే ఆ కాలంలోనే గుడిపాటి వెంకటాచలం తన భార్యను పాఠశాలలో వదిలి, తాను కాలేజీకి వెళ్లేవారన్నారు. నాటి నుంచీ స్త్రీల అభ్యున్నతికి అనేక రచనలు చేశారన్నారు. అకాడమిక్ కో ఆర్డినేటర్ జి.శరత్ బాబు మాట్లాడుతూ స్త్రీకి కూడా మనసు ఉంటుందని, తన అభిప్రాయాలను గౌరవించే వారితోనే నడవగలుగుతుందని బహిరంగంగా చాటిన వేదాంతి చలం అన్నారు. కార్యక్రమంలో హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామ నాయుడు, ఇందిర, రాజబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో సదుపాయాల పరిశీలన

కంబాలచెరువు: నల్సా ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు శనివారం సందర్శించారు. కారాగారంలోని ఖైదీల జీవన పరిస్థితులు, పరిశుభ్రత, పారిశుధ్యం, బ్యారక్స్‌లోని వాష్ రూమ్‌లు, మురుగునీటి నిర్వహణ, వాటర్ ట్యాంకులు, ఖైదీల భద్రత, ఆహార ప్రమాణాలు, వసతులు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అన్నారు. వారి తరఫున వాదించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా డీఎల్ఎస్ఏకు తెలియజేయాలన్నారు. ఖైదీలందరూ పరివర్తన చెంది న్యాయబద్ధమైన జీవనశైలిని అలవరుచుకోవాలన్నారు. కారాగారంలోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వృత్తి నైపుణ్యతకు ఖైదీలకు మరింత శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే జిల్లా న్యాయసేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి తెలియజేయాలని, సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



తంటికొండలో పందిరి రాట వేస్తున్న ఈఓ వెంకటలక్ష్మీకుమార్, అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ ఆధ్వర్యంలో పండితులు ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కూతురుగా చేసి పందిరి రాట వేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బిక్కవోలు: గ్రామంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వీర ప్రభాకర్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 31 వరకు మొదటి విడత దరఖాస్తులను తీసుకుంటామన్నారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

పెదపూడి: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టేవారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపడతామని తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపర గ్రామంలో నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. మట్టి తవ్వకాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.